క్లుప్తంగా

నేడు త్రీఫేజ్ సరఫరాలో అంతరాయం

వేలేరు : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో 33 కేవీ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌ల పరిధిలో బుధవారం సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు అన్ని 11 కేవీ ఫీడర్ లైన్‌ల త్రీఫేజ్ సరాఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కుమారస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 26న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ జి.సాంబరెడ్డి తెలిపారు. హంటర్ రోడ్డు సిటిజన్ క్లబ్, మెడీకవర్ హాస్పిటల్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, నందిహిల్స్, జూపార్కు, హంటర్ హిల్స్, అర్కా స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఖర్గేను కలిసిన ఎంపీ కావ్య



హన్మకొండ చౌరస్తా: వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన డాక్టర్ కడియం కావ్య.. తన తండ్రి ఎమ్మెల్యే శ్రీహరితో కలిసి ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పార్లమెంట్‌లో ఎంపీగా డాక్టర్ కావ్య తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. జై భీం, జై భద్రకాళి, సేవ్ కానిస్టిట్యూషన్ అంటూ ప్రమాణ స్వీకారాన్ని ముగించారు.

బ్యాడ్మింటన్‌లో సుకృతికి గోల్డ్‌మెడల్స్

రామన్నపేట: నగరంలోని కిట్స్ కళాశాలలో ఈనెల 23, 24వ తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఎల్‌బీ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న సుకృతి.. మహిళల సింగిల్స్, అండర్-19 బాలికల సింగిల్స్ విభాగాల్లో గోల్డ్‌మెడల్స్ సాధించినట్లు ఎల్‌బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. ఈమేరకు కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సుకృతిని కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఫిజికల్ డైరెక్టర్ బి.ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ కె.రాజేందర్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఈ.రాజేందర్, చైర్మన్ నిరంజన్, గేమ్స్ కమిటీ సభ్యులు రాజేశ్వరరావు, శృతి, రజిని, సునీత అభినందించారు.

అడ్డా కూలీలకు బతుకు భరోసా కరువు

కాజీపేట: దినదిన గండంగా బతుకులీడుస్తున్న అడ్డా కూలీలకు ప్రభుత్వం నుంచి బతుకు భరోసా కరువైందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి ఆవేదన వ్యక్తం చేశారు. కాజీపేట పట్టణంలో భవన నిర్మాణ కార్మికుల విస్తృత స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కార్మిక శాఖలో పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల దరఖాస్తులను పరిష్కరించాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాలోతు శంకర్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కరాజు గౌడ్, పూర్ణచందర్, లక్ష్మి, కల్యాణి, మేరీ పాల్గొన్నారు.

భద్రకాళిని దర్శించుకున్న జనగామ అడిషనల్ కలెక్టర్

హన్మకొండ కల్చరల్: నగరంలోని భద్రకాళి అమ్మవారిని జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. అంతకుముందు కలెక్టర్‌కు ఆలయ ఈఓ, ప్రధాన అర్చకులు ఆలయంలోకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శాలువా కప్పి సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఆలయ ప్రధాన అర్చకుడు శేషు అందజేశారు.

కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షురాలిగా స్వాతి

హసన్‌పర్తి: కాంగ్రెస్ హసన్‌పర్తి మండల ఉపాధ్యక్షురాలిగా 65వ డివిజన్ మునిపల్లికి చెందిన బత్తుల స్వాతి నియమితులయ్యారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ ప్రకటించారు. సుబేదారిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో స్వాతికి మంగళవారం జరిగిన కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు నియామక ఉత్తర్వులు అందించారు.

పారిశుద్ధ్య పనులు

ఖిలా వరంగల్: వరంగల్ 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్‌లో బల్దియా అధికారుల ఆధ్వర్యంలో ప్రధాన డ్రెయినేజీలో పేరుకుపోయిన వ్యర్థాలను మంగళవారం తొలగించారు. స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, జవాన్ ప్రశాంత్, వీర మల్లయ్య, అశోక్, మల్లయ్య, జ్యోతి పాల్గొన్నారు.

వారాంతపు సంతలో సౌకర్యాలు కరువు

- పార్కింగ్ స్థలం లేక ట్రాఫిక్ ఇబ్బందులు
- ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి సంత నిర్వహణ
- గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి



మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వారాంతపు సంత (ఫైల్)

వేలేరు : మండల కేంద్రంలో ప్రతి బుధవారం జరిగే వారాంతపు సంతలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో చిరువ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయలు, వివిధ రకాల నిత్యవసర వస్తువులు రోడ్లపైనే విక్రయిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారాంతపు సంతకు వచ్చే వాహనాలకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారానికి సరిపడా కూరగాయలు, నిత్యవసర సరుకులు కొనుగోలు చేసేందుకు వివిధ గ్రామాల్లో ఆయా గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో సంత నిర్వహిస్తుంటారు. కానీ మండల కేంద్రంలో నిర్వహించే సంత ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో నడుస్తుండటంతో వ్యాపారులకు, ప్రజలకు నష్టాలు కలిగించే విధంగా ఉన్నాయని పలువురు విమర్శిస్తున్నారు. సంత నిర్వహించే స్థలం తమదని కొంత మంది ప్రైవేటు వ్యక్తులు ప్రతి దుకాణం నుంచి రూ.30 చొప్పున వసూలు చేసి గ్రామపంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నట్లు తెలిసింది. గతంలో సంతలో ఏర్పాటు చేసే దుకాణదారులు గ్రామ పంచాయతీకే డబ్బులు చెల్లించేవారని, కానీ కొన్ని సంవత్సరాల నుంచి ఆ స్థలం తమదని, గ్రామ పంచాయతీకి డబ్బులు చెల్లిస్తే సంత నిర్వహించేందుకు ఒప్పుకోమంటూ చిరువ్యాపారస్తులను కొందరు హెచ్చరించినట్లు చర్చ జరుగుతోంది. ప్రతీ దుకాణదారుడు తమకే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేయడంతో వ్యాపారులు చేసేదేంలేక ప్రైవేట్ వ్యక్తులకే డబ్బులు చెల్లిస్తున్నారు. వ్యాపారస్తుల నుంచి డబ్బులు తీసుకుంటున్న ప్రయివేట్ వ్యక్తులు.. సంత నిర్వహణకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. దీంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి గ్రామపంచాయతీ స్థలంలో వారాంతపు సంత నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్రీడా పాఠశాలలను వినియోగించుకోవాలి



దామెర : క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

దామెర : మండలంలోని విద్యార్థులు క్రీడా పాఠశాలలను వినియోగించుకోవాలని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపికలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీపీ క్రీడలను ప్రారంభించి మాట్లాడారు...క్రీడా పాఠశాలల్లో ప్రవేశం పొంది రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంఈఓ రమాదేవి, నోడల్ అధికారి జుమ్మా మాట్లాడుతూ.. ఎంపికైన విద్యార్థులు రాష్ట్రంలోని హకీంపేట్, హైదరాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ఉన్న క్రీడ పాఠశాలల్లో ప్రవేశం పొందే అవకాశం ఉందని తెలిపారు. ఎంపీడీఓ కల్పన, ఎంపీఓ రంగాచారి, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యారాలు రుక్మిణీదేవి, ఫిజికల్ డైరెక్టర్ దేవేందర్, ఉపాధ్యాయులు రాజేశ్వర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

శాయంపేట : స్పోర్ట్స్ స్కూల్స్‌ల్లో ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థులు మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ రమాదేవి మంగళవారం ప్రకటనలో తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించే హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతి ప్రవేశాల కోసం గురువారం మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించి ఎంపికైన విద్యార్థులను జిల్లా, రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. 8 నుంచి 9 ఏళ్లలోపు ఉండి 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం విద్యార్థులు లేటెస్ట్ పాస్‌పోర్ట్ సైజ్‌ఫోటో, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్ ఒరిజినల్, జిరాక్స్, ఆధార్‌కార్డు, కమ్యూనిటీ సర్టిఫికెట్లు ఎమ్మార్సీ భవనంలో అందించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

పరకాలలో...

పరకాల : స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి మండల స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఎస్.రమాదేవి, మండల నోడల్ అధికారి నామాని సాంబయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీన పరకాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 9గంటలకు ఎంపిక ప్రక్రియ ఉంటుందని తెలిపారు.

సంకటహర చతుర్థి ప్రత్యేక పూజలు



కాజీపేటలో గణపతి హోమం చేస్తున్న భక్తులు

మడికొండ: సంకటహర చతుర్థిని పురస్కరించుకుని మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ఉన్న విజయగణపతి ఆలయంలో మంగళవారం సాయంత్రం పంచామృతాభిషేకాలు, గరికలతో విశేష అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పరశురాం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, మంత్రోచ్చరణల మధ్య గరికలతో వైభవంగా పూజలు నిర్వహించారు. కార్యనిర్వాహణాధికారి కే.శేషభారతి, పైడిపాల రఘుచందర్, బైరి రాజుగౌడ్, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, వస్కుల ఉమ, బోగి కేదారి, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

63వ డివిజన్‌లో..

కాజీపేట: 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని అభయాంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు గణపతి హోమం చేశారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేసి వెండి తొడుగులతో ప్రత్యేకంగా అలంకరించారు.

హక్కుల సాధనకు పోరాడాలి



రాజ్ కుమార్, మండల అధ్యక్షుడు

ధర్మసాగర్ : ముదిరాజ్‌ల హక్కుల సాధన, అభివృద్ధి కోసం ముదిరాజ్ యువకులు పోరాడాల్సిన అవసరం ఉందని మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్ అసోసియేషన్) వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో మెపా జిల్లా ప్రధానకార్యదర్శి అమ్మగారి శ్యామ్ అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి, హక్కుల సాధనకు ప్రతి ముదిరాజ్ బిడ్డ పోరాటం చేయాలని అన్నారు. అనంతరం మెపా మండల అధ్యక్షుడిగా దాసరి రాజ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు రాజ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శులు సింగారపు రామకృష్ణ, దండు చిరంజీవి, నీరటి రాజు, నాయకులు చెన్నబోయిన సాయిశివ, దాసరి నవీన్, భాషబోయిన మహేందర్, మాచర్ల సుభాష్, సాయితేజ, అబ్బరబోయిన వేణుగోపాల్ పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన కొడగాని అశోక్‌రావు అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం బీఆర్ఎస్ నాయకుడు నాగుర్ల వెంకటేశ్వర్లు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అశోక్‌రావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట రైతు సంఘం నాయకుడు వరికెల కిషన్‌రావు, మాజీ ఉపసర్పంచ్ ధర్మారావు, సంతోష్ రావు, ప్రతాప్‌రెడ్డి, వీరన్న తదితరులు ఉన్నారు.

స్నేహ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- ఎంపీడీఓ గుండె బాబు



బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ బాబు, ఫౌండేషన్ ప్రతినిధులు

కమలాపూర్ : స్నేహ ఫౌండేషన్ అందిస్తున్న పలు సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎంపీడీఓ గుండె బాబు కొనియాడారు. మండలంలోని కానిపర్తిలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం రూ.50 వేల విలువ గల స్కూల్ బ్యాగ్స్, బెల్టులు, నోట్ బుక్స్, కంపాస్ బాక్సులు, పెన్నులు, పండ్ల మొక్కలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన లభిస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోందని అన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పసరగొండ శైలజ, హెచ్ఎం ప్రభాకర్, స్నేహ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్తూరి ఇంద్రసేన, ప్రధానకార్యదర్శి నరెడ్ల సీతారాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జనగాని సుమన్‌గౌడ్, ఉపాధ్యక్షులు జనగాని సాంబయ్య, మాదిరెడ్డి సంధ్యారెడ్డి, గౌరవ అధ్యక్షుడు కోడిగూటి బాలరాజు, తొగరి హనుమయ్య, దాతలు కుమారస్వామి పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

హన్మకొండ: హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ఈనెల 27న జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకుడు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈమేరకు ధర్నా కరపత్రాలను కేయూసీ రోడ్డు, 6వ డివిజన్ కుమార్‌పల్లిలో మున్సిపల్ కార్మికులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన పీఆర్‌సీలో రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని, మున్సిపల్ కార్మికులకు చెప్పులు, చీపుర్లు, పారలు, గడ్డపారలు, గ్లౌజులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లయ్య, గణేష్, దామోదర్ పాల్గొన్నారు.

ఊరచెరువులో రేగడిమట్టి దొంగలు



పొక్లెయినర్‌తో టిప్పర్లలో నింపుతున్న మట్టి



రేగడిమట్టి తరలిస్తున్న టిప్పర్

ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గల ఊరచెరువు నుంచి అనుమతులు లేకుండా కొందరు అక్రమార్కులు హిటాచి సహాయంతో సుమారు పది టిప్పర్ల ద్వారా రేగడిమట్టిని అక్రమంగా తరలిస్తూ దందాకు తెరలేపారు. కొద్దిరోజుల క్రితం రాత్రిపూట మట్టి తరలించగా గ్రామస్తులు ప్రశ్నించడంతో నిలుపుదల చేశారు. కాగా సోమవారం నుంచి పగలు, రాత్రి అనే తేడా లేకుండా రేగడిమట్టిని సమీప ప్రాంతాల్లోని ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరైనా వాహనాలను ఆపి ప్రశ్నిస్తే తమకు పర్మిషన్ ఉందని, ఇష్టం వచ్చిన చోట ఫిర్యాదు చేసుకోవాలని చెబుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వెంకటాపూర్ నుంచి ఒంటిమామిడిపల్లి మీదుగా టిప్పర్లు వెళ్తున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు అక్రమార్కులపై రాయల్టీ, ఫెనాల్టీ విధించడంతోపాటు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముదిరాజ్‌ల ఆందోళన

చెరువు నుంచి రేగడిమట్టి తరలిస్తే గుంతలు ఏర్పడి చేపలు పట్టే సమయంలో ప్రమాదాలు జరుగుతాయని ముదిరాజ్ కులస్తులు ఆందోళన చెందుతున్నారు. రెండు పంటలకు నీరు అందించే చెరువు మధ్యలోనే ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. డబ్బుల కోసం మట్టిని అమ్ముకుని స్వలాభం పొందే అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రైం కార్నర్

ప్రాణం తీసిన పందుల గొడవ

- పురుగులమందు తాగిన వృద్ధురాలి మృతి




బొందమ్మ (ఫైల్)

ఎల్కతుర్తి : పందుల విషయంలో జరిగిన గొడవ ఒకరి ప్రాణం తీసింది. అవమానం భరించలేక మనస్థాపం చెందిన ఓ వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని దండేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లకొండ సూరమ్మ, కెంసారపు ఓదెమ్మకు పందుల విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో కెంసారపు బొందమ్మ (60) గొడవలో తలదూర్చింది. దీంతో సూరమ్మకు సపోర్టుగా మాట్లాడిందని ఓదెమ్మ కుటుంబ సభ్యులు రాజు, రమా, ఓదెమ్మ, రమ్యా, కెంసారపు శ్రీను బొందమ్మపై దుర్భాషలాడారు. దీంతో బొందమ్మ కుటుంబ సభ్యులు పెద్దమనుషుల వద్ద మాట్లాడుకుందమని చెప్పి సముదాయించారు. కానీ 15 రోజులు గడిచినా ఓదెమ్మ కుటుంబ సభ్యులు కులపెద్దల వద్దకు రాకుండా దాటవేశారు. బూతులు తిట్టి అవమాన పర్చడంతో తీవ్ర మనస్థాపం చెందిన బొందమ్మ ఈనెల 22వ తేదీన పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బొందమ్మ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అస్థిపంజరం లభ్యం..

దామెర : మండల కేంద్రంలోని పెద్దగుట్టపై అస్థిపంజరం లభ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంగ మల్లయ్య (70) నవంబర్ 20, 2020వ సంవత్సరంలో తన భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా సోమవారం మల్లయ్య మనువడు వంగ కిరణ్ గొర్లను మేపేందుకు పెద్దగుట్టపైకి వెళ్లగా అక్కడ అస్థిపంజరం, దాని పక్కన ఉన్న గీతల స్వెటర్ మరియు లుంగీ, చెప్పులను గమణించి కుటుంబ సభ్యులకు, పోలీస్‌లకు సమాచారం ఇచ్చాడు. అస్థిపంజరం వంగ మల్లయ్యదిగా కుటుంబ సభ్యులు నిర్ధారించారు. తన తండ్రి ఆత్మహత్య చేసకున్నాడని, అతని మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని మల్లయ్య కుమారుడు వంగ సంపత్ మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం



పెద్దనవేణి కావ్య

కమలాపూర్ : చిట్యాల మండలంలోని చింతకుంటరామయ్యపల్లికి చెందిన పెద్దనవేణి కావ్య అనే విద్యార్థిని అదృశ్యమైనట్లు కమలాపూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఇ.హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కావ్య నాలుగేళ్లుగా కమలాపూర్ మండలం గూడూరులోని తన తాత పాక ఆగయ్య వద్ద ఉంటూ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదోతరగతి పూర్తి చేసింది. ఇంటర్మీడియట్‌లో చేరాల్సి ఉండగా.. ఈ నెల 23వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కావ్య చామన ఛాయ రంగుతో 5.2 ఫీట్లు ఎత్తు ఉంటుందని, పసుపు రంగు చుడీదార్, ఆకుపచ్చ రంగు ప్యాంటు ధరించి ఉటుందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 872685125 కు ఫోన్ చేయాలని కోరారు. కావ్య మేనమామ పాక మొగిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



కిరణ్(ఫైల్)

దామెర : చికిత్సపొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని సింగరాజుపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జన్నతహ కిరణ్ (28) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా తన సోదరి వివాహానికి మూడేళ్ల క్రితం రూ.8 లక్షల 60 వేలు అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలో తెలియక కుమిలిపోయేవాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన కిరణ్ .. ఈనెల 15వ తేదీన పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన బంధువులు వెంటనే అతన్ని పరకాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతున్న కిరణ్ పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై అశోక్ తెలిపారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో సదుపాయాలు కల్పించాలి





డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలని సూచించారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ రకరకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని కోరారు. నర్సయ్య, రాజ్‌కుమార్, ఉదయ్, రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలి

జిల్లాలో అనుమతిలేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, అలాగే విద్యను వ్యాపారం చేస్తున్న స్కూళ్ల గుర్తింపును రద్దుచేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్‌ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోతు రాజేష్‌నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని అనుమతి లేకుండా నడుపుతున్న పాఠశాలల వివరాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో స్కూల్ యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ విక్రయించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్ఐ నగర కార్యదర్శి బాలగోని రాకేష్, నాయకులు మహేష్, రాజేష్, వెంకటేష్, రంజిత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ భరోసా'ను అమలు చేయాలి

హన్మకొండ: అంబేడ్కర్ అభయ హస్తం (భరోసా) పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల సమగ్ర అభివృద్ధి, భద్రతపై అసెంబ్లీలో చర్చించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేవెళ్లలో జరిగిన సభలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించి అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పిందని గుర్తుచేశారు. ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతం పెంచుతామని, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను వేర్వేరుగా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర నాయకురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, జిల్లా కార్యదర్శులు చుంచు నరేష్, మేకల అనిత, జిల్లా సహాయ కార్యదర్శి పోలెపాక మల్లేశం, న్యాయవాది కలకోటి మహేందర్, నాయకులు అయిలయ్య, రాజు, సురేందర్, క్రాంతి, సామాజిక కార్యకర్త కేడల ప్రసాద్‌తో పాటు దళిత బహుజన ఫ్రంట్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన భూములను గుర్తించాలి



వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాజీపేట అర్బన్: గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములు, ఎఫ్‌టీఎల్ ల్యాండ్స్, సీలింగ్ ల్యాండ్స్‌ను గుర్తించి వెనక్కి తీసుకుని హద్దులు నిర్ణయించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు కాజీపేట తహసీల్దార్ బావుసింగ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారని గుర్తు చేశారు.